మహ్మద్ షమీ ఔట్

కొటియాన్‌కు పిలుపు

మెల్‌బోర్న్: ముంబైకి చెందిన యువ ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ తనుష్ కొటియాన్‌కు భారత జట్టులో చోటు దక్కింది. మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో తనుష్ అతడి స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగబోయే చివరి రెండు టెస్టుల కోసం అతడు జట్టులోకి వచ్చాడు. మంగళవారం తనుష్ మెల్‌బోర్న్‌కు పయనమయ్యే అవకాశమున్నట్టు బీసీసీఐ ప్రతినిధి ఒకరు చెప్పారు. చివరి రెండు టెస్టులకు గాను తనుష్.. జడేజా, వాషింగ్టన్‌కు బ్యాకప్‌గా ఉండనున్నాడని ఆయన తెలిపారు. ఇదిలాఉండగా ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్టులకైనా అందుబాటులో ఉంటాడనుకున్న భారత పేసర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశే ఎదురైంది. గతేడాది వన్డే వరల్డ్ కప్‌లో గాయమై కొద్దిరోజుల క్రితమే కోలుకున్న అతడు దేశవాళీల్లో మెరుగ్గా రాణిస్తున్నాడు. ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు శ్రమిస్తున్న షమీ.. ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో ఆడి రాణించాడు. కానీ ఈ టోర్నీ అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షలలో అతడి ఎడమ మోకాలికి గాయమైందని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో బీజీటీలో షమీ ఆడతాడని ఆశించిన అభిమానుల ఆశలు ఆవిరయ్యాయి.

వివాహ బంధంలోకి సింధు..

భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. ఉదయ్‌పూర్ (రాజస్థాన్)లోని ఓ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించిన ఒక దీవిలో ఆదివారం అర్ధరాత్రి 11.20 గంటలకు ఆమె పెళ్లి జరిగింది. కొద్దిమంది కుటుంబసభ్యుల నడుమ వరుడు వెంకట దత్త సాయి.. సింధు మెడలో మూడు ముళ్లు వేశాడు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో వీరి రిసెప్షన్ వేడుక జరుగనుంది.

నిఖత్ జరీన్ ఫౌండేషన్ ప్రారంభం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో బాక్సర్లను ప్రోత్సహించే దిశగా భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ ముందడుగు వేసింది. సోమవారం నిఖత్ జరీన్ ఫౌండేషన్‌ను ప్రారంభించింది. ఈ వేడుకకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో మరింత మంది బాక్సింగ్ చాంపినయ్లను తయారుచేయాలనే సంకల్పంతో నిఖత్ ముందుకురావడం హర్షణీయమన్నారు. అనంతరం ఆయన ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. నిఖత్ మాట్లాడుతూ.. వచ్చే జాతీయ బాక్సింగ్ పోటీలలో పతకాలు కొల్లగొట్టిన తెలంగాణ బాక్సర్లకు తమ ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతిని అందించనున్నామని చెప్పింది.

దవాఖానలో కాంబ్లి

ముంబై: గతకొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లి దవాఖానలో చేరాడు. థానే జిల్లాలోని కల్వర్‌లో ఉన్న ఓ దవాఖానలోని ఐసీయూలో కాంబ్లీకి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్‌తో అతడు దవాఖానలో చేరగా వైద్య పరీక్షలలో అతడి మెదడులో రక్తం గడ్డకట్టినట్టు తేలింది.

హైదరాబాదీ షూటర్‌కు రజతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: 67వ నేషనల్ చాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల విభాగంలో హైదరాబాదీ షూటర్ ధనుష్ శ్రీకాంత్ రజతంతో మెరిశాడు. భోపాల్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల ఫైనల్‌లో మహారాష్ట్రకు చెందిన శాహు తుషార్ మనె స్వర్ణం సాధించగా.. కొద్దిపాటి తేడాతో ధనుష్ రెండో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో తుషార్ 10.1 పాయింట్లు సాధించగా ధనుశ్ 9.8తో రజతం సాధించాడు.

కేఎస్‌జీ బాస్కెట్‌బాల్ విజేత ఫ్యూచర్ కిడ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కేఎస్‌జీ వర్సిటీ బాస్కెట్‌బాల్ లీగ్ బాలికల విభాగంలో ఫ్యూచర్ కిడ్స్, బాలుర విభాగంలో ఓక్రిడ్జ్ జట్లు టైటిళ్లు సాధించాయి. సోమవారం మాదాపూర్‌లోని డీబీఏ బాస్కెట్‌బాల్ ప్రాంగణంలో జరిగిన బాలికల ఫైనల్‌లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్.. 46-28తో డీపీఎస్ హైదరాబాద్‌పై నెగ్గింది. బాలుర ఫైనల్‌లో ఓక్రిడ్జ్ గచ్చిబౌలి జట్టు.. 80-65తో చిరెక్ కొండాపూర్‌పై గెలిచింది. ఈ సందర్భంగా కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ ప్రమోటర్ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దడానికి కేఎస్‌జీ వర్సిటీ బాస్కెట్ బాల్ లీగ్ ఒక మంచి వేదిక అని తెలిపారు.

అమెరికా క్రికెటర్‌కు అల్లీపురం అభినందన

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా అండర్-19 మెన్స్ క్రికెట్ జట్టుకు ఎంపికైన నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన సుదిని నితీశ్ రెడ్డిని టీడీసీఏ ప్రెసిడెంట్, శాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి అభినందించారు. అమెరికాలో పుట్టిపెరిగిన నితీశ్.. క్రికెట్‌లో రాణిస్తున్నాడు. నాగర్‌కర్నూల్‌లో జిల్లా నుంచి ఓ ఆటగాడు అమెరికా క్రికెట్ జట్టులో ఆడటం ఎంతో సంతోషమని ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నితీశ్ స్ఫూర్తితో తెలంగాణలో మరింతమంది గ్రామీణ క్రికెటర్లు జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు.